ప్రజాశక్తి

గురువారం 17 జులై 2025

ఎన్నిక అనంతరం నరసింహరాజుకు ఛైర్మన్ నియామక పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే రాజు, ఎన్నికల అధికారి ఆనంద్‌కుమార్

8.70 లక్షల ఎకరాలు బీడు



- 10 శాతమే పడ్డ విత్తనం
- అందులోనూ వాడుతున్న పంటలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు మే నెల ఆఖరులో ఊరించిన వర్షం తరువాత మాయం అయ్యింది. జూన్ నుంచి ఇప్పటి వరకు వర్షాభావ పరిస్థితులే అనంతపురం జిల్లాలో కొనసాగుతున్నాయి. దీంతో ఈ ఏడాది పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. 8.70 లక్షల ఎకరాల్లో ఇంకా విత్తనం కూడా పడలేదు. రైతులు పదును కోసం ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. జులై రెండవ వారమైనా వానల్లేకపోవడంతో తీవ్రమైన నిరాశలో రైతాంగం ఉన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మాత్రం ఆగస్టు వరకు ఖరీఫ్ సాగుకు అనుకూలమని చెబుతున్నా రైతులు మాత్రం జులై రెండవ వారం తరువాత పంటలపై ఆశలు వదులుకునే పరిస్థితులే ఉంటాయి. ఎందుకంటే రైతులు ప్రధానంగా కార్తుల ఆధారంగా విత్తనం విత్తుకుంటారు. సరైన కార్తులు దాటితే పంట వేసినా పెద్దగా ప్రయోజనం ఉండదన్న భావనలో ఉంటారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలో ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి.

10 శాతమే సాగు

అనంతపురం జిల్లాలో 9.68 లక్ష ఎకరాల్లో ఖరీఫ్ పంట సాగయ్యే అవకాశముందని వ్యవసాయ శాఖ మొదట అంచనా వేసింది. అయితే ఇప్పటి వరకు చూస్తే జిల్లాలో సాగైంది కేవలం 98,171 ఎకరాల్లో మాత్రమే ఉంది. ఇందులో ప్రధాన పంటల వారీగా చూస్తే సాగునీటి వసతి కింద సాగయ్యే వరి, మొక్కజొన్న పంటలే ఎక్కువగా ఉండటం గమనార్హం. వరి జిల్లాలో సాధారణ సాగు 54,362 ఎకరాలయితే 43,205 ఎకరాల్లో వరి సాగైంది. మొక్కజొన్న 40 వేల ఎకరాల్లో అయితే విత్తనం పడింది 26 వేల ఎకరాల్లో ఉంది. తక్కిన అన్ని పంటల సాగు మరీ తక్కువగా ఉంది. వర్షాధారం కింద అత్యధికంగా సాగయ్యే వేరుశనగ పంట సాధారణ సాగు విస్తీర్ణం 4.88 లక్షల ఎకరాలవుతే.. విత్తనం పడింది కేవలం 12,429 ఎకరాల్లో మాత్రమే. ఇక పత్తి పంట సాధారణ 1.20 లక్షల ఎకరాలకుగానూ సాగైంది 11,445 ఎకరాలు. కంది పంట 1.84 లక్షల ఎకరాల సాధారణ సాగుకుగానూ 956 ఎకరాల్లో విత్తనం పడింది. 42 వేల ఎకరాలు సాధారణ సాగు ఆముదం పంట అయితే విత్తనం వేసింది 741 ఎకరాల్లో. ఇతర పంటల సాగుకు కూడా అతి తక్కువగా ఉంది. మొత్తంగా ఇప్పటి వరకు ఇంక విత్తనం పడకుండా బీడుగా జిల్లాలో 8.70 లక్షల ఎకరాలు ఉంది.

38.2 శాతం వర్షపాతం లోటు

అనంతపురం జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు చూస్తే 38.2 శాతం వర్షపాతం లోటుంది. 31 మండలాలుంటే కణేకల్, శెట్టూరు మండలాలు మినహా తక్కిన 29 మండలాల్లోనూ వర్షాభావ పరిస్థితులే నెలకుని ఉన్నాయి. కణేకల్‌లో సాధారణ వర్షపాతం 79.1 మిల్లీమీటర్లకుగానూ 139 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. ఆ తరువాత శెట్టూరులో 70.1 మిల్లీమీటర్లకుగానూ 84.4 మిల్లీమీటర్లు పడింది. ఈ రెండు మినహా తక్కిన అన్ని మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకుని ఉన్నాయి. ఇందులో తొమ్మిది మండలాల్లో వర్షాభావం అంటే 50 శాతం కంటే లోటు ఉండగా, 11 మండలాల్లో 50 శాతం కంటే ఎక్కువ లోటు వర్షపాతముంది. ఈ మండలాల్లో 50 శాతం కంటే ఎక్కువ లోటు వర్షపాతం నెలకొంది. ఎక్కువ లోటు వర్షపాతమున్న మండలాలు చూస్తే గుంతకల్లు, పెద్దవడుగూరు, యాడికి, తాడిపత్రి, పెద్దపప్పూరు, పామిడి, కూడేరు, పుట్లూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాలున్నాయి. ఈ వారంలో వర్షం కురవకపోతే పంట సాగుపై ఆశలు వదులుకునే పరిస్థితులు ఎక్కువగా కన్పిస్తున్నాయి.

మడకశిర నగర పంచాయతీ టిడిపి కైవసం

ఛైర్మన్‌గా నరసింహరాజు ఎన్నిక

ప్రజాశక్తి మడకశిర టౌన్

శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నగరపాలక పంచాయతీని తెలుగుదేశంపార్టీ కైవసం చేసుకుంది. వైసీపీ ఆధ్వర్యంలో ఉన్న ఛైర్మన్ స్థానాన్ని టిడిపి దక్కించుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం మడకశిర మున్సిపల్ ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో లక్ష్మీనరసమ్మ ఛైర్మన్ పదవి నుంచి దిగిపోయారు. ఖాళీగా ఉన్న ఛైర్మన్ స్థానానికి బుధవారం నాడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఆనందకుమార్ ఎన్నికను నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్మన్ ఎన్నికకు ప్రతేక సమావేశం నిర్వహించరు. ఇందులో భాగంగా టీడీపీకి అనుకూలగా 14 మంది కౌన్సిర్లు, ఎమ్మెల్యే ఎక్స్ అఫిషియో ఓటుతో కలిసి 15 మంది మద్దతు లభించింది. ఛైర్మన్ ఎన్నికకు కావాల్సిన పూర్తి మెజార్టీ ఉండడంతో మున్సిపల్ ఛైర్మన్‌గా నరసింహరాజు, వైస్ ఛైర్మన్‌గా ప్రభావతిలు ఎన్నికయ్యారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్లకు నియామక పత్రాలను ఎన్నికల అధికారి అందించారు. ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను అభినందించారు.

రామగిరి ఎంపిపి ఎన్నిక మళ్లీ వాయిదా

అనంతపురం : శ్రీసత్యసాయి జిల్లా రామగిరి ఎంపిపి ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన అధ్యక్షురాలి ఎన్నిక మరోసారి కూడా అలానే పునరావృతం అయ్యింది. ఎన్నికకు సంబంధించి కోరం లేని కారణంగా అధికారులు ఎన్నికను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రామగిరి ఎంపిపిగా పని చేస్తున్న మీనగ నాగమ్మ అనారోగ్య సమస్యలతో గతేడాది డిసెంబర్‌లో మరణించారు. దీంతో అక్కడ ఎంపిపి ఎన్నిక అనివార్యం అయ్యింది. ఇక్కడ వైసిపికి మెజార్టీ ఎంపిటిసిలు ఉన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత ఇద్దరు వైసిపి ఎంపిటిసిలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. మరణించిన ఎంపిపి స్థానం కాకుండా 9 ఎంపిటిసి స్థానాల్లో మూడు టిడిపి, ఆరు వైసిపికి బలం ఉంది. ముందునుంచి వైసిపి తాము ఎంపిపి ఎన్నికలో పాల్గొనబోమని చెబుతోంది. ఆ విధంగానే గత రెండు సార్లు జరిగిన ఎన్నికలో వైసిపి పాల్గొనలేదు. మూడవ సారి బుధవారం నాటి ఎన్నికకు కూడా ఆ పార్టీ ఎంపిటిసిలు గైర్హాజరయ్యారు. మెజార్టీ ఎంపిటిసిలు గైర్హాజరు కావడంతో ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. ఎంపిపి ఎన్నిక సమస్యాత్మకం అయిన నేపథ్యంలో ఎలాంటి ఘర్షణ వాతావరణం నెలకొనకుండా పోలీసులు ముందుస్తు బందోబస్తును ఏర్పాటు చేశారు.

నగదు బదిలీతో హమాలీల పొట్టకొట్టొద్దు

ప్రభుత్వం ఈ ఆలోచనను విరమించుకోవాలి - రాష్ట్ర సివిల్ సప్లయ్ స్టాక్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణ

జిల్లా మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

హమాలీల జీవితాలను నాశనం చేసేలా ఉన్న నగదు బదిలీ పథకం ఆలోచనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని రాష్ట్ర సివిల్ సప్లయ్ స్టాక్ హమాలీల వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఆర్.కృష్ణ డిమాండ్ చేశారు. పుట్టపర్తి సాయి ఆరామం అతిథి గృహంలో జిల్లా సివిల్ సప్లయ్ హమాలీ యూనియన్(సిఐటియు అనుబంధం) 5వ మహాసభలను బుధవారం నిర్వహించారు. జిల్లాలోని హమాలీలు ఆర్టీసీ బస్టాండ్ నుంచి సాయి ఆరామం మహాసభ వేదిక వరకు ప్రదర్శన చేపట్టారు. అక్కడ సిఐటియు జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహాసభకు ముఖ్యఅతిథిగా వచ్చిన ఆర్.కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా హమాలీల కడుపు కొట్టే సరుకులు బదులు నగదు బదిలీ ఆలోచన ప్రభుత్వం మానుకోవాలన్నారు. నగదు బదిలీ వల్ల సామాన్య కుటుంబాలు ఆహార భద్రత కోల్పోవాల్సి ఉంటుందన్నారు. హమాలీలను ప్రభుత్వ 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రతినెలా 5వ తేదీన వేతనాలు చెల్లించాలని కోరారు. సరుకు లోడింగ్ అన్‌లోడింగ్‌లో హమాలీలపై పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. 12 రోజుల పని విధానాన్ని అమలు చేయాలన్నారు. మతి చెందిన హమాలీ కార్మికుల కుటుంబాలకు రావాల్సిన నష్టపరిహారం, బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకం పంపిణీ చేసే బియ్యం బ్యాగులకు అదనంగా ఒక్కో బ్యాంకు 12 రూపాయలు ఇవ్వాలన్నారు. మంచినీటి బిల్లు, స్వీపర్ల బిల్లులు అన్ని పాయింట్లలలో సక్రమంగా ఇవ్వాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ మాట్లాడుతూ హమాలీ కార్మికులకు ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 12 స్టాక్ పాయింట్లలో విధులు నిర్వహిస్తున్న హమాలీలకు సిఐటియు అండగా ఉంటుందని తెలియజేశారు.

నూతన కమిటీ ఎన్నిక

జిల్లా మహాసభలో హమాలీ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా నేలకోటప్ప, ఉపాధ్యక్షులుగా శ్రీరాములు, చుక్క లింగం, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా రామదాసుతో పాటు మరో 11 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ప్రతి ఇంటిపై సౌరశక్తి ఉత్పత్తి

మోడల్ గ్రామానికి రూ.కోటి ప్రోత్సాహం - రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

రాయితీ గోడ పత్రికలను విడుదల చేస్తున్న మంత్రి, కలెక్టర్ తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం

కాలుష్య రహిత మోడల్ గ్రామాల దిశగా ప్రతి ఇంటిపై సౌరశక్తి ఉత్పత్తి చేసేలా ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలియజేశారు. బుధవారం పట్టణంలోని జేవీఎస్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన సబ్సిడీ పథకంపై అవగాహన సదస్సును కలెక్టర్ టిఎస్.చేతన్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పిఎం సూర్యఘర్ పథకంలో మహిళల భాగస్వామ్యం ఎంతో కీలకమన్నారు. కోటి ఇళ్ల మీద రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేగంగా అన్ని ఇళ్ల మీద రూఫ్ టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకునే గ్రామానికి కోటి రూపాయల ప్రత్యేక నిధులను అందిస్తామన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు ప్రభుత్వం, బ్యాంకులు ఇచ్చే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ 3 కిలోవాట్ల సోలార్‌ను ఏర్పాటు చేసుకుంటే రూ.2.10 లక్షలు అవుతుందని, ఇందులో పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలకు రూ.1.12 లక్షలు బ్యాంకు రుణాన్ని అందిస్తుందని, సబ్సిడీ రూ.70 వేలు వస్తుందన్నారు. లబ్దిదారుని వాటా కేవలం రూ.20వేలు మాత్రమే అన్నారు. ఇంటి వాడుకకు పోగా మిగిలిన సౌర విద్యుత్తును ప్రభుత్వానికి అమ్ముకోవచ్చునన్నారు. అనంతరం "రాయితీతో మీ ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోండి.. విద్యుత్తు బిల్లు తగ్గించుకోండి" అనే బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, పెనుకొండ ఆర్డీవో ఆనంద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, డీఆర్డీఏ పీడీ నర్సయ్య, డీపీవో సమత, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు హరి

రైతుసంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-తనకల్లు

ఎపి రైతుసంఘం తనకల్లు మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, జిల్లా అధ్యక్షులు హరి ముఖ్య అతిథులుగా హాజరై సమావేశం నిర్వహించారు. మండల రైతు సంఘం కార్యదర్శిగా బి.ప్రభాకర్ నాయక్, అధ్యక్షులుగా నాగేంద్ర నాయుడులను ఎన్నుకున్నారు. వీరితో పాటు 20 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వివి.రమణ, ఎస్‌వి.రమణ, సిపిఎం మండల కార్యదర్శి ఎం.శివన్న, సిఐటియు మండల కార్యదర్శి ఒంటెద్దు వేమన్న, పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రంలో పక్కాగృహాలు లేక అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్న పేద కుటుంబాల వారిని గుర్తించి వారికి ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని సిపిఎం, సిఐటియు, ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక తహశీల్దార్ దేవేంద్ర నాయక్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో వైసిపి ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చి నిర్మాణానికి నిధులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం వహించి పేద ప్రజలకు మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సర కాలం గడిచినా పక్కాగృహాల ఊసే ఎత్తడం లేదని విమర్శించారు.. ఎన్నికల మానిఫెస్టోలో గంపెడు హామీలిచ్చి గుప్పెడు కూడా నెరవేర్చలేని చంద్రబాబు ప్రజల్ని మోసం చేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలు మేరకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గంగిరెడ్డి, నాగరాజు, దర్బార్ రెడ్డి, బాలాజీ, గుర్రప్ప, గౌసియా, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నాడు కనిపించిన సమస్యలు నేడు కనిపించవా....?

కార్మికులను బానిసలుగా చూస్తే సహించేది లేదు

నేడు చలో విజయవాడ

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి. శ్రీనివాసులు

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి అధికారంలో ఉన్నా సమయంలో పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు సమస్యల కోసం పోరు బాట పట్టిన సమయంలో ఇప్పుడు అధికారంలో ఉన్నా టిడిపి నేతలకు కార్మికుల కనిపించవా అని సిఐటియూ జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు ప్రశ్నించారు. మున్సిపల్ పారిశుద్య కార్మికులు న్యాయమైన కోర్కెలను తీర్చాలని డిమాండ్ చేస్తు గత 22 రోజుల నుంచి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో దీక్షలు చేశారు. పాలకులు, అధికారుల్లో కనీస స్పందన లేక పోవడంతో బుధవారం పారిశుధ్యకార్మికులు విధులను బహిష్కరించి నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యలయం ముందు జరిగిన సమ్మెకు మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్యదర్శి జగదీష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతు గత నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కార్మికులు తలపెట్టిన సమ్మెకు ప్రభుత్వం స్పందించని కారణంగా వారికి తోడుగా పారిశుధ్య కార్మికులు సైతం సమ్మెలోకి దిగారని అన్నారు.కార్మికుల నుండి పదివేల సంతకాలు, 7వేల పోస్ట్ కార్డులు, ముఖ్యమంత్రికి రాసిన, చెప్పులు అరిగేలా ప్రభుత్వం చుట్టూ ప్రదక్షణ చేసినా పట్టించుకోకపోవటం దారుణమన్నారు. గత్యంతరం లేకనే సమ్మెకు దిగాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. ఈ సమస్యలన్నిటికీ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉందని తెలిపారు. సమ్మెను మరింత ఉదృతం చేయడానికి చలో విజయవాడ చేపడుతున్నామని తెలిపారు. గురువారం మున్సిపల్ డిఎంఏ ఆఫీసు ముట్టడి చేస్తున్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిన్ ఫెడరేషన్ అధ్యక్షులు మల్లికార్జున, జగదీష్, కోశాదికారి ఆనంద్, నాయకులు రామచంద్ర, బాబయ్య, మూర్తి, శంకరా, చంద్రశేఖర్, కుమార్, బాలాజీ, చంద్ర, మూర్తి, కవిత మ్మ గంగ రత్నమ్మ, శోభమ్మ, ఓబులమ్మతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : తమ సమస్యలు పరిష్కారం కోసం బుధవారం 4వ రోజున మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ ఇంజినీరింగ కార్మికులు బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పైపల్లి గంగాధర్, పెడపల్లి బాబా మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గత నాలుగు రోజులుగా వివిధ రూపాలలో నిరసన తెలియజేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం జీవో నెంబర్ 36 ను అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ కార్మికులు గురువారం విజయవాడలోని ఎండి కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు చెప్పారు. అందుకు బుధవారం సాయంత్రమే ఇంజనీరింగ్ కార్మికులు బయలుదేరి వెళుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ యూనియన్ నాయకులు రమణ, రమేష్, గణేష్, రామదాసు, బెస్త గంగాధర్, శివకష్ణ, సాయినాథ్, సద్దాం హుస్సేన్, వీరికి మద్దతుగా పారిశుధ్య కార్మిక నాయకులు రామయ్య, పెద్దన్న పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ :ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కో కన్వీనర్ అయూబ్ ఖాన్ డిమాండ్ చేశారు. వేతనాల పెంపు, సంక్షేమ పథకాల అమలు తదితర డిమాండ్ల పరిష్కారం కోసం ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులు కోరుతున్న విధంగా జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచి చెల్లించాలన్నారు. ఇంజనీరింగ్‌కార్మికుల నైపుణ్యానికి అనుగుణంగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు తీరేదాకా ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె కొనసాగిస్తామన్నారు. వీరితో పాటు ఈనెల 18వ తేదీ నుంచి అడిషనల్, పారిశుధ్యకార్మికులు ధర్మవరం మున్సిపాలిటీ నుండి పూర్తి మద్దతుగా సమ్మె చేపట్టడం జరుగుతుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ రెగ్యులర్ కార్మిక సంఘం నాయకులు ఓబుళపతి, లింగరాజు, చిన్నూరు హరి, రామాంజనేయులు, బొగ్గు నాగరాజు, జయకృష్ణ, పారిశుధ్యకార్మిక సంఘం నాయకులు బాబు, ఆది, వెంకటరాముడు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు

పుట్టపర్తిలో సమ్మె శిబిరంలో పాల్గొన్న కార్మికులు, నాయకులు

ధర్మవరంలో సమ్మె శిబిరంలో పాల్గొన్న కార్మికులు, నాయకులు

ఆటోస్టాండ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

మడకశిర టౌన్ : పట్టణంలోని మధుగిరి రోడ్డు సర్కిల్ వద్ద జైభీమ్ ఆటో స్టాండును స్థానిక శాసనసభ్యులు ఎంఎస్.రాజు బుధవారం ప్రారంభించారు. ఆటో వర్కర్ల సమస్యలపై ఇటీవల ప్రత్యేక సమావేశం పెట్టిన ఎమ్మెల్యే ఆటో వర్కర్ల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగానే మడకశిర పట్టణంలో ఆటోస్టాండు ప్రారంభించారు. ఆటో నడిపే సమయంలో ప్యాసింజర్ల పట్ల గౌరవ, మర్యాదలతో నడుచుకోవాలని సూచించారు. పరిమిత ప్యాసింజర్లతో ప్రయాణం చేయడం మంచిదని తెలిపారు. (ఆటో కార్మికులకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడతానని హామీ ఇచ్చారు.అదే విధంగామడకశిర పట్టణంలోని రాజీవ్ గాంధీ సర్కిల్ వద్ద చెప్పులు కుడుతూ జీవనం కొనసాగించే చర్మకారుడు రామాంజిప్పను ఎమ్మెల్యే పలకరించారు. చర్మకారుడి పింఛను అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. రోజు సంపాదన, కుటుంబం వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు.

మధ్యవర్తిత్వంతో ప్రయోజనాలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణ కోర్టు ఆధ్వర్యంలో బుధవారం మధ్యవర్తిత్వం దేశం కోసం అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం 90 రోజుల స్పెషల్ డ్రైవ్ లో భాగంగా నిర్వహించడం జరిగిందని సీనియర్ డివిజన్ జడ్జి వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో జూనియర్ డివిజన్ జడ్జి నందిని, న్యాయవాదులు సీనియర్ , జూనియర్ న్యాయవాదులు, కక్షిదారులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం: మధ్య వర్తిత్వం, జాతి శ్రేయస్సు నినాదంతో బుధవారం మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణ నుండి ప్రారంభమైన ర్యాలీలో ఏ డీజే తో పాటు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్యలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - నల్లచెరువు

ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి అలేఖ్య సూచించారు. ఈ మేరకు ఆమె బుధవారం స్థానిక కెజిబివిని తనిఖీ చేశారు. వంటశాలను పరిశీలించి తాజా కూరగాయలను వాడాలన్నారు. ఆ తర్వాత విద్యార్థుల క్లాసులను పరిశీలించి విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ప్రతి గురువారం ఐరన్ మాత్రలు వాడాలని ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ రామచంద్రారెడ్డి, ఎఎన్ఎం సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పి నస్రిన్, హెల్త్ అసిస్టెంట్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండలంలోని గొట్లూరుకు చెందిన బండ్ల నారాయణ (80 సం) వద్ధాప్యం తో బుధవారం మృతిచెందాడు. విశ్వదీప సేవా సంఘం వారు మృతుని కుటుంబ సభ్యులకు నేత్రదానం పై అవగాహన కల్పించారు. మృతుని కుటుంబ సభ్యుల సహకారంతో విశ్వదీప సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ,కుళ్లాయప్ప కంటి రెట్రావైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర తదితరులు మృతుని నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన మృతుని కుమారుడు బండ్ల మంజునాథ్, కోడలు వనిత, కుమార్తె భాగ్యలక్ష్మి, తమ్ముడు బండ్ల రామాంజనేయులుకు విశ్వదీప సేవా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ కోళ్ళమొరం చంద్రశేఖర్ రెడ్డి, ప్రెసిడెంట్ గాజుల సురేష్, వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE Ist ADDL JUNIOR CIVIL JUDGE, ANANTHAPURAMU
O.S.No: 964/2020

Between:
Annam Mallika ...Plaintiff
And
1. S.Ramakrishna,
2. Kalikat Shaheen Taj ...Defendants

Notice to the Defendant No: 1

D1: S. Ramakrishna, S/o Sirivella Sreeramulu, R/o D/ No:.24-557, Siddaiahgutta, Dharmavaram Town, Anantapuramu District., Now at Sri Sathyasai Dist.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం 17-07-2025 వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

N.R.K.Mohan, Advocate,
Anantapuramu. Cell: 9440787100

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జిగారి కోర్టులో, అనంతపురము
E.P.NO:1010/2024 in A.A. No. 214/2021

Between:
మెస్సర్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, కదిరి బ్రాంచి ...డిక్రీహోల్డార్
మరియు
కె. రెడ్డప్పనాయుడు మరియొకరు ...జడ్జిమెంట్ డెటార్స్

జడ్జిమెంట్ డెటార్స్‌కు నోటీసు

జె.డి.ఆర్.1: కె.రెడ్డప్పనాయుడు, తండ్రి కె.మల్లప్పనాయుడు, ఇంటి నెం.2-85, కొక్కంటి గ్రామము, తనకల్లు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా-515571.
జె.డి.ఆర్.2: కె.శ్రీనివాసులు, తండ్రి కె. తిప్పన్న, ఇంటి నెం.12-119-ఎ, ఉస్తిలిపల్లి గ్రామము మరియు పోస్టు, తనకల్లు మండలం, శ్రీ సత్యసాయి జిల్లా-515571.

ఇందుమూలముగా జడ్జిమెంట్ డెటార్స్ అయిన మీకు తెలియజేయడమేమనగా, పై వాది మీ పై పైకేసును దాఖలు చేసినారు. మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపినను చేరనందున, ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలుపుటకు పై కేసును 31-07-2025వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు సదరు తేదీనాడు ఉదయం 10.00 గంటలకు ఖుద్దునగానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును అని తెలియజేయబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:31/07/2025

ఇట్లు,
శ్రీ ఆరేటి చెన్నప్ప,
డిక్రీ హోల్డర్‌పరం న్యాయవాది, అనంతపురము.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, కదిరి
E.P. No:2/2017 in O.S. No:174/2014

Between:
మదనపల్లి చాంద్‌బాషా S/o ఎమ్.మహబూబ్ పీరా డోర్ నెం.9-488-23ఎ1, మౌనిక థియేటర్ దగ్గర, కదిరి టౌన్, అనంతపురం జిల్లా ...డిక్రీ హోల్డర్
మరియు
నల్లమాడ ఫరూక్ S/o లేట్ ఎన్.సలాం, డోర్ నెం.3-351, opp ఉస్మానియా ఘని మసీదు కుమ్మరవాండ్లపల్లి, కదిరి రూరల్ మండలం అనంతపురం జిల్లా. ...జెడ్జిమెంట్ డెట్టార్

వేలము ప్రకటన

పై E.P. లోని డిక్రీ హోల్డరు తన డిక్రీ బాపతు మొత్తము వసూలుపై క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలము కోరినాడు. పై కోర్టువారు ఆస్తుల వేలము కొరకు 04-08-2025వ తేదికి వాయిదా వేయబడినది. వేలములో పాల్గొను వారు 04-08-2025వ తేదిన ఉదయం 10:30 గం॥లకు హాజరై వేలములో పాల్గొన వచ్చునని ఇందుమూలముగా తెలిజేయడమైనది.

షెడ్యూలు

Property situated within the R.D of Anantapur (Now Hindupur) S.R.D Kadiri and within the local limits of Kadiri Revenue Village:

1.House bearing Door No. 3-351 in S.No 743-2 within the following boundaries.
EAST:- open site, **South**:- Road, **West**:- plot No 18 **North**: plot No. 16. **Measuring East-West**: 16 feet **North-South**:47 feet, Totally measuring 83-55 Sq yards
Full Value Rs.3,00,000/-

property situate within the R.D of Anantapur (Now Hindupur) S.R.D of Kadiri and within the local limits of kadiri Revenue Village:

2. Govt Dry **S.No.** 742-3 **A.C** 0-32 Cents.
Govt Dry **S.No.** 742-4 **A.C** 0.32 Cents.
Govt Dry **S.No.** 742-5 **A.C** 0-34 Cents.
Govt Dry **S.No.** 742-6 **A.C** 1-08 Cents.
out of above Four Survey numbers 103-33 Sq yards. open site measuring on Eastren Side **(North-South)** 61 feet: western side **(North-South)** 60 feet, Northern side **(East-west)** 14 feet. Southern side **(East-west)** 17 feet within the following boundaries:
East:- Road, **South**:- Road, **west**:- open site of Shahanaz Begum, **North**:- open site of kummara Nagaiah
Value Rs 2,00,000/-

3) Govt Dry **S.No**. 742-3 **A.C** 0-32 Cents.
Govt Dry **S.No**. 742-4 **A.C** 0-32 Cents.
Govt Dry **S.No**. 742-5 **A.C** 0-34 Cents.
Govt Dry **S.No**. 742-6 **A.C** 1-08 Cents.
out of above four survey numbers 250-66 Sq yards open site measuring **East-West**:47 feet, **North-South**: 48 feet within the following boundaries:
East:-open site of K.Md. Nisar Ali and others.
South:- open site of Maddileti
West:-Road,
North: open site of K.Md. Nisar Ali and others.
Value Rs 2,50,000/-

DHR Value Rs.7,50,000/-

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

S.Md.ఫైజుల్లా,M.A., LLB.,
A.P.సిద్ధార్థ సాయికుమార్ రెడ్డి,B.A., LLB.,
డిక్రీహోల్డరు తరుపు వకీళ్ళు, కదిరి.

నాడు భార్య.. నేడు భర్త..!

రాధా నరసింహరాజు

నరసింహరాజు

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మడకశిర నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నికను బుధవారం నిర్వహించారు. ఇందులో టిడిపి మద్దతుదారుడు నరసింహరాజు ఛైర్మన్‌గా ఎన్నిక అయ్యారు. గతంలో ఈయన భార్య రాధా నరసింహరాజు మడకశిర ఛైర్మన్‌గా కొనసాగారు. ప్రస్తుతం నరసింహరాజు ఎన్నిక కావడంతో భార్యాభర్తలు ఇద్దరూ ఛైర్మన్లుగా మడకశిర పంచాయతీ పాలకవర్గానికి నాయకత్వం వహించే అవకాశం దక్కింది. మడకశిర నగర పంచాయతీ 2012లో ఏర్పాటైంది. 2014లో నగర పంచాయతీకి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నగర పంచాయతీని కైవసం చేసుకుంది. అందులో భాగంగా మొట్టమొదటి నగర పంచాయతీ తొలి అధ్యక్షులుగా ప్రకాష్ ఎన్నికయ్యారు. ఆ పార్టీ ఒప్పందం ప్రకారం రెండున్నర సంవత్సరాల పాటు ఆయన ఛైర్మన్‌గా కొనసాగారు. అనంతరం శరణ్య సుబ్రమణ్యం ఏడాదిన్నర కాలం పాటు మడకశిర నగర పంచాయతీ తొలి మహిళా అధ్యక్షురాలుగా కొనసాగారు. అనంతరం జరిగిన ఎన్నికలో అధ్యక్షురాలిగా రాధా నరసింహారాజు ఎన్నికయ్యారు. ఆ తర్వాత మడకశిర నగర పంచాయతీని వైసిపి కైవసం చేసుకుంది. వైసీపీ నుంచి లక్ష్మీ నరసమ్మ అధ్యక్షురాలు అయ్యారు. ఈ ఎన్నిక సమయంలోనూ రెండున్నర సంవత్సరాల ఒప్పందం ఛైర్మన్

మడకశిర నగర పంచాయతీ పీఠంపై భార్యాభర్తలు

గిరిని ఆమెకు ఇచ్చారు. అయితే రెండున్నర సంవత్సరాల పూర్తయినా మరొకరికి ఛైర్మన్ పదవి ఇవ్వలేదు. దీంతో వైసిపిలోని ఒక వర్గం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇదే పరిస్థితుల్లో 2024 ఎన్నికలకు ముందు, తర్వాత వైసిపి కౌన్సిలర్లు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. నగర పంచాయతీలో టిడిపికి కౌన్సిలర్ల బలం పెరిగింది. ఈ క్రమంలో బుధవారం నాడు నిర్వహించిన ఎన్నికలో తెలుగుదేశం ఛైర్మన్ పీఠాన్ని సొంతం చేసుకుంది. నగర పంచాయతీ ఛైర్మన్‌గా నరసింహ రాజుకు ఎన్నిక అయ్యారు. గతంలో ఆయన భార్య రాధా నరసింహారాజు ఛైర్మన్‌గా పని చేశారు. ఇలా భార్యాభర్తలిద్దరూ ఛైర్మన్ పీఠాన్ని అధిరోహించి మడకశిర నగర పంచాయతీలో పాలకవర్గంలో ప్రత్యేకతను చాటుకున్నారు.

కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించండి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని 11వ వార్డు పరిధిలో ఉన్న రాజరాజేశ్వరి కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆ ప్రాంత ప్రజలు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను కోరారు. ఈ విషయంపై బుధవారం వార్డు కౌన్సిలర్ అంజలితో కలిసి కమిషనర్ కు కాలనీవాసులు కలసి వినతిపత్రం అందజేశారు.కాలనీ ఏర్పడినప్పటి నుంచి రోడ్లు మురుగు కాలువలు వీధి దీపాలతో పాటు మంచి నీటి సరఫరాకు సంబంధించి కొళాయిలు సైతం ఏర్పాటు చేయలేదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు పాలకులు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ స్పందన లేదన్నారు. సకాలంలో పురపాలక సంఘానికి చెల్లించాల్సిన పనులు అన్నింటిని తాము చెల్లిస్తున్నామని చెప్పారు. సమస్యను గుర్తించి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించిన కమిషనర్ త్వరలో కాలనీలో పర్యటించి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మణి భూషణ్, నారాయణ, భరత్, అశోక్, శిరీష, శారద తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన చేనేతలకు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

నియోజకవర్గంలోని అర్హులైన పేదలకు, చేనేతలకు ఇళ్లస్థలాలు ఇచ్చి గృహాలు నిర్మించి ఇచ్చే బాధ్యత మనదేనని ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. బుధవారం ధర్మవరం పట్టణంలోని తనకార్యాలయంలో రెవెన్యూ, మున్సిపల్, హౌసింగ్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో డిఇ శంకర్ లాల్, ఏఈ చిరంజీవి, మున్సిపల్ ఆర్ఐ శివకుమార్, టిపిఒ అలివేలమ్మ, విజయ భాస్కర్, టిడ్కో ప్రతినిధి తిరుమని, రాజేష్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ సురేష్, వీఆర్వో రవి మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు. గత 15రోజులుగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాల్లో వచ్చిన ఫిర్యాదులు, విజ్ఞప్తుల మీద చర్చించారు. ప్రధానంగా చాలా మంది ఇళ్ల పట్టాలు లేవని, ఇళ్ల మంజూరుకి సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వచ్చాయని చెప్పారు. వీటిన్నింటినీ పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, పురుషోత్తం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

సమావేశంలో మాట్లాడుతున్న డిపిఒ సమత

ప్రజాశక్తి - పరిగి

పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని డిపిఒ సమత హెచ్చరించారు. ఈ మేరకు ఆమె బుధవారం మండలంలోని పి నరసాపురం పంచాయతీలో పర్యటించారు. పంచాయతీలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని సమాచారంతో బుధవారం ఉదయం ఆమె గ్రామాన్ని పరిశీలించారు. గ్రామంలో ప్రజలతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరిగి ఎంపీడీవో కార్యాలయంలో మండల వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ ప్రతి ఉదయం గ్రామాలలో కచ్చితంగా పంచాయతీ కార్యదర్శులు కలియతిరగాలన్నారు. పంచాయతీలో ప్రతి ఇంటి నుండి తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించి దానిని చెత్త సేకరణ కేంద్రానికి తరలించేలా చొరవ చూపాలన్నారు. ప్రతిరోజు సెక్రటరీలు ప్రజలకు అందుబాటులో ఉండాలని అలా లేనట్లు ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే తక్షణ చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డప్ప, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండలం లో దొడగట్ట, పెద్దమంతూరు సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో డిపిఒ సమత బుధవారం పర్యటించారు. ఇంటింటి చెత్త సేకరణ, తడి, పొడి చెత్త వేరు చేయడం గురించి అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ బాన్ చేశామనిదానిని అతిక్రమించిన వారిపై రూ. 2500 అపరాధ రుసుం విధించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ గోవిందప్ప, పంచాయితీ కార్యదర్శులు రమేష్, జనార్దన్, తెలుగుదేశం నాయకులు రాము, శంకర, దొడగట్ట ఎంపిటిసి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని దేమకేతేపల్లి సచివాలయంలో విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన ఉద్యోగులకు సర్పంచి ఈడిగ తిరుమలేష్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సర్పంచి ఈడిగ తిరుమలేష్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల కాలం పాటు ప్రజలకు అనేక సేవలు అందిస్తూ పంచాయతీ అభివృద్ధి కి ఎంతగానో కృషి చేశారని అన్నారు. బదిలీ అయిన వెల్ఫేర్ అసిస్టెంట్ అరవింద్ రెడ్డి, సర్వేయర్ కృపావతి, వెటర్నరి సొహేల్‌ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమం లో అడ్వకేట్ గంగరాజు, గ్లోబల్ ఇన్స్యూట్ డైరెక్టర్ నాగేంద్ర, ప్రజాసంఘాల నాయకులు ప్రవీణ్, వెంకటేష్,సుధాకర్, సచివాలయ ఉద్యోగులు, మంజునాథ్, విశ్వనాథ్, రామంజి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులను సన్మానిస్తున్న సర్పంచి, తదితరులు

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - చిలమత్తూరు

కదిరిలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న సిపిఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆపార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కార్మిక కర్షక కార్యాలయంలో సోమవారం సిపిఎం నాయకులు సమావేశమయ్యారు. మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ, కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ. జిల్లా ప్రతినిధులతో పాటు రాష్ట్రస్థాయి నాయకులు హాజరయ్యే ఈ మహాసభల్లో ప్రజా సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధారెడ్డి, మండల కార్యదర్శి వెంకటేష్, రామచంద్ర, సుధాకర్, నాగరాజు, నారాయణప్ప, మంజు, అశ్వర్థ రెడ్డి, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : టిడిపి

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీ పార్థసారథి

ప్రజాశక్తి - లేపాక్షి

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ,హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె.పార్థసారధి పేర్కొన్నారు. ఈ మేరకు వారు మండల పరిధిలోని బిసలమనేపల్లి పంచాయతీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని పరిశ్రమలు స్థాపించి హిందూపురాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రోడ్డు, డ్రయినేజీ తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే కలెక్టర్ తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షులు ఆంజనప్ప, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు శ్రీనివాసరావ్, వీరయ్య, బాలాజీ, మండల కన్వీనర్ అభిలాస్, మాజీ ఎంపీపీ ఆనంద్ కుమార్, మాజీ సర్పంచి మాలక్క, నాగరాజు రామాంజినమ్మ, అరుణమ్మ, తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, ఎస్ఐ నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : కూటమి ప్రభుత్వం ప్రజలకు పాలనను మరింత చేరువ చేసేందుకు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మంత్రి అనగాని సత్యప్రసాద్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలో నల్లరాళ్లపల్లి గ్రామంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ రంగారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, బాలాజీ, శ్రీదేవి, చెన్నమ్మ, తెలుగు యువత మల్లికార్జున, డీలర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో ఆమె సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే సునీత ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అలాగే గ్రామంలో సమస్యలు కూడా అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక కారణాల వలన ఎవరికైనా పథకాలు అందకపోతే వాటిని వెంటనే పరిశీలించి.. పథకాలు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

కొత్త చెరువు రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూర పేర్కొన్నారు. బుధవారం మండల పరిధి లోని బైరాపురం పంచాయతీలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బైరాపురం సర్పంచ్ రవి, టిడిపి సీనియర్ నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు మాజీ ఎంపీపీ వాణి శ్రీనివాస్ ,మండల టిడిపి కన్వీనర్ రామకృష్ణ, వలిపి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో అధ్యక్షులుగా జయచంద్ర

ప్రజాశక్తి గోరంట్ల

మండలంలోని పాలసముద్రం సింగిల్ విండో అధ్యక్షులుగా బెల్లాల చెరువు జయచంద్ర బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, నాయకులు అజమతుల్లా, నరేష్, మనోహర్, అశ్వత్ రెడ్డి, నరేంద్ర రాయల్ తదితరులు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు ఈ సందర్భంగా సింగిల్ విండో అధ్యక్షులు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఎఒ నాగూర్ మహ్మద్ ముస్తఫా బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా కోరమండల్ ఇంటర్నేషనల్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో అనుమతులు లేని 142 బస్తాల ఎఫ్20 ఎరువులను గుర్తించి వాటి అమ్మకాలను నిలుపుదల చేసినట్లు ఎఒ చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కృష్ణారెడ్డి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రగతి, గ్లోబల్ జెన్ సిబిఎస్సి పాఠశాల విద్యార్థులకు పదోతరగతి తర్వాత ఎంచుకోవాల్సిన కోర్సులపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంషాబాద్ కు చెందిన 9లైఫ్ కెపి21సెంచరీ కాలేజ్ ప్రతినిధులు భవానీ శంకర్, విశ్వనాథ్ మాట్లాడుతూ పదవ తరగతి తర్వాత విద్యార్థులు ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవడానికి కేవలం ఎంపిసి, బైపిసిలే కాకుండా మరెన్నో ఇతర కోర్సులున్నాయన్నారు. ఎంపిసి, బైపిసిల ద్వారా కేవలం ఇంజనీరింగ్, మెడిసెన్ చేసే అవకాశాలున్నాయని చెప్పారు. కాంపిటీటివ్ పరీక్షలు ఉన్నాయో విద్యార్థులకు వివరించారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకొని ఈ పరీక్షల ద్వారా ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు, ప్రిన్సిపల్స్, డైరెక్టర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న పాఠశాల ప్రతినిధులు

నేరాలు ఘోరాలు

ఏకకాలంలో 10 ఇళ్లలో చోరీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి ప్రశాంతి గ్రామం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి స్టాఫ్ క్వార్టర్స్‌లోని పది ఇళ్లలో బుధవారం ఏకకాలంలో చోరీ జరిగింది. ఎస్పీ ఆఫీసు కూతవేటు దూరము లో ఉండటమే కాక, అదే కోటర్స్ లో కలెక్టర్ బంగాళా ఉండడం కూడా విశేషం. నిత్యం సెక్యూరిటీ ఉన్న ప్రాంతంలో దొంగలు పోలీసులకు సవాల్ విసిరారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రాత్రి వేళల్లో విధుల్లో ఉన్న సిబ్బందిని టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడ్డారు. భారీ ఎత్తున నగదు, బంగారు అపహరించుకుపోయారు. ఇళ్లకున్న తాళాలు పగలగొట్టి బీరువా డోర్లను తెరిచి ఉండటంతో తమ ఇళ్లల్లో చోరీ జరిగిందన్న విషయాన్ని గుర్తించిన బాధితులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏకకాలంలో భారీ దొంగతనానికి పాల్పడుతున్న విషయం తెలుసుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో అక్కడికి చేరుకొని అక్కడ పరిసరాలను పరిశీలించారు. అయితే ఒకేసారి ఇంత పెద్ద ఎత్తున 10 ఇళ్లలో చోరీ జరగడంతో ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది బెంబెలెత్తిపోయారు. నిరంతరం సెక్యూరిటీ ఉన్న ప్రాంతంలో ఇంత భారీగా చోరీ జరగడంపై సర్వత్ర పోలీసులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే తరహాలో గత సంవత్సరం కూడా పట్టణం సమీపంలోని సందీప్ విల్లాస్‌లో రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన దుండగులు భారీగా బంగారు నగలు అపహరించక పోయారు. గతంలో చేసిన దొంగలను సైతం నేటికీ పట్టుకోలేకపోయారు. అపహరించిన బంగారు నగలు ఇప్పటికీ రికవరీ కాలేదు. ఇళ్లలో చోరీ విషయంపై సిసి పుటేజీలను పోలీసులు పరిశీలించి గాలింపు చర్యలు చేపట్టారు. అతి త్వరలో దొంగలను పట్టుకుని తీరుతామని పోలీసులు చెబుతున్నారు. రాత్రిపూట గస్తీలను పెంచాలని వెంటనే దొంగలను పట్టుకోవాలని బాధితులు కోరుతున్నారు. ఇదే విషయంపై పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్నను మాట్లాడుతూ చోరీలో ఎంతమేర బంగారు నగలు పోయాయని ఇంతవరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. అయితే చోరీ సమాచారంపై తమ ప్రత్యేకబృందాలతో పర్యవేక్షణ, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వృద్ధురాలిపై దాడి

ప్రజాశక్తి గాండ్లపెంట

మండల పరిధిలోని మల్ల మీద పల్లి పంచాయతీలోని బనాన్ చెరువుపల్లి చెందిన 80 సంవత్సరాల సరస్వతిపై గుర్తుతెలియని వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. వృద్ధురాలి తలకు కట్టెతో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఎవరూ లేని సమయం చూసి ఇంటిలోకి చొరబడిన దుండగుడికి గమనించి వృద్ధురాలు అడ్డుపడటంతో ఆమెపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో తలకు తీవ్ర గాయమైన సరస్వతిని కదిరి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యానికి అనంతపురం తరలించారు. ఈ దాడిపై కేసు దర్యాప్తు చేస్తున్నఉట్ల ఎస్ఐ వలిబాషా తెలిపారు.

కూలిన ప్రహరీ.. తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

కూలిన ఇంటి ప్రహరీ

పుట్టపర్తి పట్టణంలోని ప్రధాన రహదారిలో బుధవారం ప్రహరీ కూలిపోయింది. ఆసమయంలో ఎవరూ అక్కడ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. పట్టణంలోని సత్య సాయి జనరల్ ఆసుపత్రి ఎదురుగా శిధిలావస్థకు చేరిన భవంతిని కూల్చివేసి నిర్మాణం చేపట్టారు. అయితే ఆ భవంతికి ప్రహరీతో పాటు ఇనుప రేకులు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా ప్రహరీ కూలిపోయింది, అక్కడ నిలిపి ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో మధ్యాహ్న సమయం కావడంతో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.

బదిలీ అధికారికి సన్మానం

ప్రజాశక్తి - రొద్దం

బదిలీపై వెళుతున్న మండల సర్వేయర్ మైనుద్దీన్‌ను స్థానిక రెవెన్యూ అధికారులు బుధవారం ఘనంగా సన్మానించారు. తహశీల్దార్ ఉదయ శంకర్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగులు మైనుద్దీన్‌ను సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్, వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్ఏలు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, చంద్రమౌళి, చిన్నప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇస్లాపురం సొసైటీ అధ్యక్షులుగా పోతిరెడ్డి

ప్రజాశక్తి-పెనుకొండ

ఇస్లాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షునిగా చంద్రగిరికి చెందిన పోతిరెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు తీసుకున్నారు. ఆయనతోపాటు డైరెక్టర్లు గా గుట్టూరుకు చెందిన ఆదిశేషు, నాగలూరుకు చెందిన గోపాల్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ..సహకార సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు నారాయణస్వామి, మునిమడుగు వెంకటరాముడు, మండల కన్వీనర్ ఈశ్వర ప్రసాద్, మాజీ సర్పంచి సూర్యనారాయణ, బోయ రామకృష్ణ, సహకార సంఘం సీఈవో హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

డప్పు కొట్టకుంటే దాడులు చేస్తారా.?

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

డప్పు కొట్టమని చెప్పిందుకే దాడులు చేస్తారా అని ఎస్సీ జన సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసగానపల్లి కుళ్లాయప్ప ప్రశ్నించారు. ధర్మవరం రూరల్ సుబ్బారావు పేట గ్రామంలో ఆదివారం మొహరం పండుగ సందర్భంగా అగ్రకులస్తులు ఎస్సీ కులస్తులపై దాడి ఘటన తెలుసుకొన్న కుళ్లాయప్ప బుధవారం సుబ్బారావు పేట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా కుల్లాయప్ప మీడియాతో మాట్లాడుతూ డప్పు కొట్టను అంటే ఎస్సీల పైన దాడి చేస్తారా? అని ప్రశ్నించారు. కులం పేరుతో దూషించడం చాలా దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈ విషయాలపై ప్రభుత్వాలు పునరాలోచించాలని సూచించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు..ఈ కార్యక్రమంలో బిసి సమన్వయ కమిటీ ఉమ్మడి అనంతపురం జిల్లా చైర్మన్ ఎమ్మెస్ ఆదినారాయణ, ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు. కేశగాల్ల వెంకటేష్, ఎస్సీ జన సంఘం రాష్ట్ర ఇంచార్జ్ మాల్యవంతం రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సమాచారంతో ఎరువుల దుకాణాలు బంద్

ప్రజాశక్తి కొత్తచెరువు

విజిలెన్స్ తనిఖీలు నిర్వహిస్తారన్న ముందస్తు సమాచారంతో కొత్త చెరువులోని ఫర్టిలైజర్, ఎరువుల దుకాణాలను వాటి యజమానులు బుధవారం మూసివేశారు. దీంతో ఎరువుల కోసం దుకాణాల వద్దకు వచ్చిన రైతులు వెనుదిరిగి వెళ్లారు. వ్యవసాయ శాఖ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ శాఖల సంయుక్తంగా జిల్లా వ్యాప్తంగా తనిఖీలను రెండురోజులుగా చేపడుతున్నారు. నిబంధనలను ఉల్లంఘించి వ్యాపారాలు నిర్వహిస్తున్న తమ అక్రమాలు బయట పడతాయని భావించిన దుకాణాల యజమానులు వారి దుకాణాలను మూసివేశారని స్థానికులు విమర్శిస్తున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని తుమ్మలకుంట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త హనుమంతప్ప అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మండల టిడిపి కోఆర్డినేటర్ రంగారెడ్డి ఆదేశాలతో తెలుగు యువత మల్లికార్జున, డీలర్ రాజు తదితరులు మృతుని కుటుంబానికి రూ.10 వేలను అందజేశారు. పార్టీ తరపున కుటుంబానికి అన్ని విధాలుగా తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదిమూర్తి, మల్లికార్జున రాజు, మంజునాథ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.